క్లుప్తంగా

నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు


రూరల్ ఎస్సై సంతోషి

పార్వతీపురంటౌన్: బోగి, సంక్రాంతి, కనుమ సందర్భంగా నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని రూరల్ ఎస్సై సంతోషి హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఆమె రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని గ్రామాల్లోగాని, పరిసర ప్రాంతాల్లోగానీ ఏవిధమైన చట్ట వ్యతిరేక, అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా, నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పేకాట, కోడిపందాలలో డబ్బులను ఫణంగా పెట్టి ఆటలు ఆడిన, ఆడించిన వారిపై నిఘా పెట్టామన్నారు. అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీస్ నోటీస్ ద్వారా తెలియజేశారు. గ్రామాల్లో సారా, అక్రమ మద్యం అమ్మకాలు వంటి కార్యకాలాపాలు జరిపితే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ సంప్రదాయబద్ధంగా సంక్రాంతి వేడుకలను జరుపుకుని పోలీస్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

గ్రామాల్లో గోశాలలు ప్రారంభం

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో ఉపాధిహామీ పథకం నిధులతో నిర్మించిన గోశాలలను ఆయా గ్రామాల స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఆదివారం ప్రారంభించారు. గుచ్చిమిలో ఎంపీటీసీ సీహెచ్ జగదీశ్వరరావు, సర్పంచ్ ఎం శ్రీదేవి, స్థానిక నాయకులు బి.చిరంజీవి గోశాలను ప్రారంభించారు. అలాగే కె.సీతారాంపురంలో కె.రామకృష్ణ, వెంకటనాయుడు, ఆర్.వెంకంపేటలో ఆర్. సింహాచలరావు, మాజీ సర్పంచ్ పి.ఉమ గోశాలను ప్రారంభించారు.ఈ మేరకు వారు మాట్లాడుతూ పాడి రైతులు పెంచుతున్న పశువుల సంరక్షణకు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఓ భాను, టెక్నికల్ సహాయకులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య



గుమ్మలక్ష్మీపురం: మండలంలోని జర్న గ్రామానికి చెందిన జీలకర్ర స్వాతి (17) ఆదివారం ఆత్మహత్య చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. రెండు నెలల కిందట బొబ్బిలిలో ఈమెపై అత్యాచారం జరిగింది. ఈ సంఘటనకు సంబంధించిన వ్యవహారం కోర్టులో నడుస్తోంది. అప్పటినుంచి ఇంటిలో ఉంటున్న స్వాతి మనోవేదనకు గురై అవమానం భరించలేక గ్రామ సమీపంలో గల పాక వద్ద (కొండ సమీపంలో ఉన్న పాక) ఎవరూ లేని సమయంలో చున్నీతో ఉరి వేసుకుంది. ఆమె మృతదేహం వద్ద సూసైడ్ నోట్ లభించింది. సమాచారం తెలుసుకున్న ఎల్విన్‌పేట ఎస్సై శివప్రసాద్ సిబ్బందితో కలిసి గ్రామానికి చేరుకుని వివరాలు సేకరించారు. శవపంచనామ నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భద్రగిరి సీహెచ్‌సీకి తరలించారు. మృతురాలు పార్వతీపురం ఏకలవ్య పాఠశాలలో సీనియర్ ఇంటర్ చదువుతోంది. సూసైడ్‌నోట్‌లో ఏముందో తెలియాల్సి ఉంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


గోతులుగా మారిన మండల కేంద్రంలో రహదారి


ప్రమాదకరంగా ఉన్న పలగర రోడ్డు


సీతానగరం: గోతులను తప్పించుకుని వెళ్తున్న నిత్యావసర సరుకుల వ్యాన్

అధ్వానంగా రోడ్లు
పల్లెల్లో అవస్థలు


ప్రమాదకరంగా ఉన్న వంతరాం-గంగాడ రోడ్డు

- పండగలకు వచ్చేవారికి తప్పని తిప్పలు
- గుమ్ములు గోతులతో వాహనచోదకులకు అవస్థలు

బలిజిపేట: పండగలకు పల్లెలకు వచ్చే వారికి రహదారుల సమస్య శిరోభారంగా మారింది. పండగ సమయానికి అద్దాల్లాంటి రోడ్డు నిర్మిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం కనీసం మరమ్మతులైనా చేపట్టకపోవడంతో పల్లెలకు వచ్చే ప్రజలు తీవ్ర అసౌకర్యాలకు గురవుతున్నారు. వంతరాం నుంచి గంగాడ వచ్చే వారికి రహదారి ప్రాణాంతకంగా మారింది. మండల కేంద్రమైన బలిజిపేటలో నాలుగురోడ్ల జంక్షన్ వద్ద ఉన్న మలుపు రోడ్డు ఒకవైపు పూర్తిగా పాడవడంతో అటువైపుగా వచ్చే భారీ వాహనాలు ఒకవైపు వాలిపోవడంతో ఎటువంటి ప్రమాదాలు సంభవిస్తాయోనని సమీపంలో ఉండే వ్యాపారులు, ప్రయాణికులు భీతిల్లుతున్నారు. పలగర రోడ్డు ప్రమాదకరంగా ఉన్నప్పటికీ పట్టించుకునే నాథుడే కరువయ్యాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. బైరిపురం నుంచి అంపావిల్లి వెళ్లే రహదారి గుమ్ములు, గోతులతో ప్రమాదకరంగా ఉందని దానికి మరమ్మతులైనా చేపట్టలేదని ఆయా గ్రామాల ప్రజలు తెలుపుతున్నారు. ఇటువంటి నరకకూపాల్లాంటి రహదారులపై ఏవిధంగా ప్రయాణించగలమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నారు.

- గోతులమయమైన బీటీ రోడ్లు

సీతానగరం: సంక్రాంతి పండగ సందర్భంగా గ్రామాలకు చేరుకుంటున్న బంధువులు, వలసల నుంచి స్వగ్రామాలకు చేరుకుంటున్న వారికి గోతుల మయమైన రోడ్ల నుంచి విముక్తి కల్పిస్తామని చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేయకపోవడంతో వారంతా మూడు రోజులుగా అవస్థలు పడుతున్నారు. ఏగోటివలస-దయానిధిపురం వయా గాదెలవలస గ్రామాల రోడ్డుపై రాళ్లు తేలి పోవడంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. అలాగే చినభోగిలి నుంచి బగ్గందొరవలస మీదుగా మక్కువ వెళ్తున్న బీటీరోడ్డు పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడం, భారీ స్థాయిలో గోతులు ఏర్పడడం వల్ల తిప్పలు తప్పడం లేదు.


సీతానగరం: రాళ్లు తేలిన దయానిధిపురం రోడ్డు

వంజరాపుకు ఘనంగా సన్మానం


వంజరాపు సత్యంనాయుడిని సన్మానిస్తున్న సీఐటీయూ నాయకులు, రైస్‌మిల్లు వర్కర్స్

బలిజిపేట: సీపీఎం సీనియర్ నాయకుడు, కామ్రేడ్ వంజరాపు సత్యంనాయుడిని రైస్‌మిల్లు వర్కర్స్ యూనియన్, సీఐటీయూ నాయకులు ఘనంగా సన్మానించారు. బలిజిపేట సీఐటీయూ కార్యాలయంలో ఈ మేరకు ఆదివారం ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ రైస్‌మిల్లుల యూనియన్ ఏర్పాటుచేయడంలో, మండలంలో ఉద్యమాల నిర్వహణ చేపట్టడంలో ప్రముఖ పాత్ర పోషించారని ప్రశంసించారు. నిరంతరం శ్రామికుల కోసం, ప్రజల కోసం, అన్యాయంగా నష్టపోయినవారికోసం పోరాటం చేయడం, సామరస్యంగా సమస్యను పరిష్కరించడంలో కార్యోన్ముఖులుగా వ్యవహరించి అందరికి తలలో నాలుకలా వ్యవహరించేవారన్నారు. అటువంటి వ్యక్తిని సన్మానించుకోవడం ఎంతో గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు జి.సత్యనారాయణ, రైస్‌మిల్లుల కార్మిక సంఘం అధ్యక్షుడు పి.అప్పారావు, మండల రైస్‌మిల్లుల అసోసియేషన్ అధ్యక్షుడు కె.రమేష్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు, బి.భానుమూర్తి, కార్మికులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక


కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పార్వతీపురం టౌన్: 2000వ సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు పార్వతీపురం బాయ్స్ ఆర్‌సీఎం పాఠశాలలో సిల్వర్ జూబ్లీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. విద్యను అభ్యసించేటప్పుడు ఉన్న ఉపాధ్యాయులను పిలిపించి వారిని సత్కరించారు. విద్యార్థులంతా పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ గతంలో జరిగిన సంతోషకరమైన క్షణాలను తలుచుకుంటూ, ఉపాధ్యాయులతో వారికున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ప్రతి ఒక్కరూ జీవితంలో ఏదో ఒక స్థాయిలో ప్రస్తుతం స్థిరపడ్డారు. రానున్న కాలంలో మిత్రులు ఎవరికైనా కష్టం కలిగితే తమ వంతు సహాయం అందించేందుకు ఈ వేదిక ఒక మార్గదర్శకంగా నిలుస్తుందని పూర్వ విద్యార్థులు అభిప్రాయ పడ్డారు.

సంతోషకర వాతావరణంలో పండుగను జరుపుకోండి


అవగాహన కల్పిస్తూ మాట్లాడుతున్న సీఐ

సాలూరు: ప్రజలు సంతోషకర వాతావరణంలో సంక్రాంతి పండగను జరుపుకోవాలని సాలూరు పట్టణ సీఐ అప్పలనాయుడు ఆకాంక్షించారు. ఈ మేరకు ఆదివారం ఆయన పట్టణంలోని తన కార్యాలయంలో మాట్లాడారు. ప్రజలు బస్సులు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు, షాపింగ్‌లు చేసేటప్పుడు,రద్దీ ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని, దొంగలు మీ విలువైన వస్తువులను కాజేసే ప్రయత్నాలు చేస్తారని గుర్తించాలని హితవు పలికారు. మైనర్లకు, లైసెన్స్‌లు లేని వారికి వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని, హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలు తీయరాదని ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలని స్పష్టం చేశారు. పండగ నేపథ్యంలో కోడిపందాలు, పేకాట, డైస్‌గేమ్స్ వంటివి ఆడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పండగకు ఇక్కడ నుండి వేరే ప్రాంతాలకు వెళ్లే వారికి తగు సూచనలు ఆటోలో ప్రచారాల ద్వారా అవగాహన పెంపొందిస్తున్నామన్నారు.

గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి

- మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు


మాజీ ఎమ్మెల్యే జోగారావును కలిసిన జిల్లా పార్టీ కమిటీలో నియమితులైన కురిటి మోహన్‌రావు


అఫీషియల్ స్పోక్స్ పర్సన్ మువ్వల సత్యం నాయుడు

పార్వతీపురంటౌన్: గ్రామస్థాయిలో వైఎస్సార్ సీపీని బలోపేతం చేయాలని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఇటీవల జిల్లా పార్టీ కమిటీలో నియమించిన సెక్రటరీ ఆర్గనైజేషనల్ కురిటి మోహన్‌రావు, అఫీషియల్ స్పోక్స్ పర్సన్ మువ్వల సత్యం నాయుడులు ఆదివారం ఆయనను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే వారిని తప్పకుండా అధినేత జగన్‌మోహన్ రెడ్డి గుర్తిస్తారన్నారు. కష్టకాలంలో ఉన్నప్పుడే పార్టీ కోసం మరింత శ్రమించాలని వారికి భవిష్యత్తులో మంచి స్థానాన్ని కల్పించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎల్‌అండ్‌టీ చైర్మన్ వ్యాఖ్యలు దారుణం


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వైనాయుడు

సాలూరు: ఉద్యోగులు వారానికి 90 గంటలు పనిచేయాలని ఎల్‌అండ్‌టీ చైర్మన్ సుబ్రహ్మణ్యం నిబంధన ప్రవేశపెట్టడం ఉద్యోగుల హక్కులకు భంగం కలిగించిందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన పట్టణంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, చైనా, యూరప్, అమెరికా వంటి దేశాలతో పోల్చుకుంటే భారతీయ కార్మికులు ఇప్పటికే ఎక్కువ పనిగంటలు పని చేస్తున్నారని తెలిపారు. సుదీర్ఘంగా వారు పనిచేయడం వల్ల కార్మికుల ఆరోగ్యం, సామాజిక జీవనం దెబ్బతీస్తోందని పేర్కొన్నారు. పనిగంటలు అదనంగా చేయించుకునే ఈ శ్రమ దోపిడీ కారణంగా 2022లో క్రైమ్ బ్యూరో రికార్డు ప్రకారం 11,486 మంది ఆత్మహత్యలు చేసుకోవడానికి దారితీసిందని పేర్కొన్నారు. ప్రస్తుతం అమలవుతున్న 8 గంటల పని విధానం ఎన్నో పోరాటాలు, త్యాగాల ద్వారా సాధించుకున్నదన్నారు. కార్మికుల హక్కులు, జీవితాలపై కుట్రపూరితమైన దాడులను రాబోయే రోజుల్లో కార్మికులందరూ సమైక్యంగా ప్రతిఘటించడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఈశ్వరరావు, సాయి తదితరులు పాల్గొన్నారు.

భోగి మంటలకు ఆ గ్రామాలు దూరం

- నారాయణపురంలో సంక్రాంతి రోజున భోగీ మంట


వెంగళరాయపురం గ్రామం


నారాయణపురంలో దేవాంగుల వీధి

బలిజిపేట: పెద్ద పండగ వచ్చిందంటే పల్లెల్లో సందడి ప్రారంభమవుతుంది. ఎక్కడ ఉన్నా వారివారి సొంత గ్రామాలకు తరలిరావడం, సంబరాలు జరుపుకోవడం సంప్రదాయం. భోగిపండగ రోజున ప్రత్యేకత భోగిమంట. సంక్రాంతి నాడు కుటుంబీకులు వారి పెద్దలను కొలుచుకోవడం, కనుమ రోజున రైతులు పాడి పశువులను కొలవడం వంటి సంప్రదాయాలు ఉన్నాయి. అయితే ఇక్కడి సంప్రదాయాల్లో మార్పులు సంభవిస్తున్నాయి. అందుకు కొన్ని సంవత్సరాల క్రితం అక్కడ జరిగిన కొన్ని సంఘటనలు వారిని కలిచివేయడంతో భోగీ మంటల సంప్రదాయంలో మార్పులు జరిగాయి. మండలంలోని వెంగళరాయపురంలో భోగి రోజున భోగిమంట వేయరు. నారాయణపురం గ్రామంలో దేవాంగుల వీధికి చెందిన వారు భోగి రోజున మంటవేయకుండా సంక్రాంతి రోజున మంటవేయడం సంప్రదాయంగా మార్చుకున్నారు. వందలాది సంవత్సరాల నుంచి వస్తున్న ఈ సంప్రదాయాన్ని ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. వెంగళరాయపురంలో వంద సంవత్సరాల క్రితం భోగిమంట వేసినప్పుడు ఓ ఎద్దు మంటల్లో పడిపోయి కాలి మృతిచెందడంతో ఆనాటి నుంచి భోగి రోజున మంటవేయడం నిలుపుదల చేశారు. అదేవిధంగా నారాయణపురంలో దేవాంగుల వీధిలో భోగి మంటను సంక్రాంతి రోజున వేస్తారు. ఇందుకు కారణం చాలా సంవత్సరాల క్రితం గ్రామంలో దేవాంగుల వీధిలో ఒక మంట, గ్రామంలో మరో మంట వేసేవారు. అప్పట్లో దేవాంగుల వీధిలో ఉండే వారి చేనేత వస్త్రాలకు చెందిన పరికరాలను గ్రామస్తులు భోగిమంటలో పడివేసేవారు. ఇలా కొంతకాలం జరిగిన తరువాత పరికరాలు లేకపోవడంతో వారి జీవనోపాధి కష్టమవడంతో దేవాంగుల వీధిలో భోగిరోజున మంటవేయడం అనే సంప్రదాయానికి ఫుల్‌స్టాప్ పెట్టి, సంక్రాంతి రోజున మంట వేయడం ప్రారంభించారు. దీంతో వారి కర్ర పరికరాలు పదిలంగా ఉండడంతో ఈ సంప్రదాయానికి తెరలేపారు. ఈ నాటికీ ఇదే సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు.

జంఝావతి సాధన కోసం బైక్ ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి సభ్యులు

- స్వామి వివేకానంద విగ్రహానికి వినతిపత్రం

పార్వతీపురంటౌన్: జంఝావతి ప్రాజెక్టు పూర్తిస్థాయి సాధన కోసం బైక్ ర్యాలీ నిర్వహించినట్లు ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మరిశర్ల మాలతి కృష్ణమూర్తి నాయుడు తెలిపారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని రాయగడ రోడ్డులో స్వామి వివేకానంద విగ్రహం వద్ద ర్యాలీ ప్రారంభించారు. వివేకానందుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మరిశర్ల మాలతి కృష్ణమూర్తి నాయుడు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ జంఝావతి ఆయకట్టు గ్రామాలైన కృష్ణ పల్లి, లక్ష్మీ నారాయణ పురం, చిన బొండపల్లి, పెద బొండపల్లి, చొక్కాపు వాని వలస, లచ్చిరాజుపేట, పులిగుమ్మి, మరిపి వలస, నర్సిపురం తదితర గ్రామాల్లో సాగింది. ఈ సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేశారు. జంఝావతి సాధన కోసం తాము చేపట్టిన క్రతువులో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చెరువుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు వి.దాలినాయుడు, సిగడం భాస్కరరావు, భాస్కర విద్యాసంస్థల అధినేత చుక్క భాస్కరరావు, సమితి ప్రతినిధులు వి. శివకృష్ణ, ఈర్ల సంజీవ నాయుడు, గొర్లి శ్రావణ్ కుమార్, చుక్క చంద్రరావు, అల్లు సత్యం నాయుడు, భారత నంద మహారాజ్ స్వామీజీ, చల్లారపు వెంకట్ నాయుడు, నల్ల బలరాం నాయుడు, నెల్లి లక్ష్మణ్ నాయుడు, మంత్రపూడి వెంకటరమణ, బొమ్మినేని అప్పారావు, గొట్టాపు చిన్నం నాయుడు తదితరులు పాల్గొనగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, జంఝావతి సాధన సమితి కన్వీనర్ ఈవీ నాయుడు మద్దతు ప్రకటించారు.

ఉత్సాహంగా, ఉల్లాసంగా యువజనోత్సవం


పార్వతీపురం టౌన్: సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ


పార్వతీపురం టౌన్: ప్రశంసాపత్రాలు అందజేస్తున్న సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

పార్వతీపురం టౌన్: జిల్లా యువజన శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక లయన్స్ క్లబ్‌లో యువజన ఉత్సవాల కార్యక్రమాలు ఉత్సాహంగా, ఉల్లాసంగా ఘనంగా నిర్వహించారు. యువత ఉత్తేజంతో కళా సాంస్కృతిక ప్రదర్శనలు ఆద్యంతం ఉర్రూతలూగించాయి. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని యువజనోత్సవాలు నిర్వహించారు. సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ముఖ్య అతిథిగా పాల్గొని స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి తక్కువ వయసులో పేదల చదువు కోసం విశేషంగా కృషి చేసిన మహనీయ వ్యక్తి స్వామి వివేకానంద అని కొనియాడారు. యువత తమలోని సామర్థ్యాన్ని శక్తిగా మలుచుకోవాలని, నైపుణ్యాన్ని వెలుగులోకి తీసుకురావాలని సూచించారు. తమ సృజనను వికాసం వైపు నడిపించాలని అన్నారు. జిల్లాలో ఐఐటీ, ఎన్ఐటీ వంటి చదువుల్లో, ఆటల్లో ప్రతిభగల విద్యార్థులు ఉన్నారన్నారు. సమయాన్ని వృథా చేయకుండా నిరంతర ప్రయత్నం, కఠోర శ్రమతో పాటు సహనం చూపితే అద్భుతమైన జీవితంలో ఉన్నతమైన స్థానం అధిరోహించవచ్చంటూ యువతలో స్ఫూర్తి నింపారు. ఆరోగ్యం మహాభాగ్యమని యువత డ్రగ్స్, మాదక ద్రవ్యాలు వంటి వాటి బారిన పడవద్దని, బంగారు భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని హితవు పలికారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

అనంతరం కావ్యశ్రీ నృత్య కళాశాల బాలికల స్వాగత గీత నృత్యం, నమశ్శివాయ గీతానికి నాట్యం, చింతమానుగూడ ఆదివాసీ కల్చరల్ టీమ్ ఆధ్వర్యంలో బాలికల థింసా బృంద నృత్యం, పార్వతీపురం యనమల నందన జానపద తప్పెట గుళ్ళు, గాయత్రి ఆలపించిన అన్నమాచార్య కీర్తన, కోలాటం, వివిధ సంస్కృతిక, సంప్రదాయ నృత్యాలు అందరినీ అలరించాయి. అనంతరం కళాకారులకు జ్ఞాపికలను, ధ్రువపత్రాలను సబ్‌కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో సెట్విజ్ సీఈఓ బి.రాంగోపాల్, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి లోచర్ల రమేష్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బీఎంబీరావు కళాకారులు, యువత, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

స్వామి వివేకానంద సేవలు స్ఫూర్తిదాయకం

పార్వతీపురంటౌన్: స్వామి వివేకానంద సేవలు స్ఫూర్తిదాయకమని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కె.కృష్ణమూర్తి తెలిపారు. ఈ మేరకు పట్టణంలోని ఏడవ వార్డు నందమూరి కాలనీలో ఆదివారం పేదలు, వృద్ధులకు తన సొంత ఖర్చుతో కొనుగోలు చేసిన దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకుని సహాయ, సహకార కార్యక్రమాలు చేపడుతున్నానన్నారు. భారతదేశ ఖ్యాతిని, మన సంప్రదాయాలను ప్రపంచ వ్యాప్తంగా చాటిచెప్పిన గొప్ప వ్యక్తి స్వామి వివేకానంద అని, భారత దేశంలోనూ, పాశ్చాత్య దేశాలలోనూ వివేకానంద గురువు రామకృష్ణ పరమహంస పేరు మీదుగా రామకృష్ణ మిషన్, రామకృష్ణ మఠాలను స్థాపించి ఎందరో విద్యావంతులను సమాజసేవకు అంకితం చేశారన్నారు. కార్యక్రమంలో పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

వివేకానంద స్వామి జయంతి సందర్భంగా మొక్కల పంపిణీ

మక్కువ: మండలంలోని వెంకట బైరిపురం గ్రామానికి చెందిన ఎంఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు మరడ శ్రీనివాసరావు స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆదివారం మొక్కలు పంపిణీ చేశారు. సుమారు రూ.5000 వెచ్చించి కొనుగోలు చేసిన వివిధ రకాల మొక్కలను వెంకటబైరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నాటారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కను నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. మొక్కలు నాటడంతో పాటు, వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత ముందుకు రావాలని ఆయన కోరారు. పాఠశాలలో నాటిన మొక్కల సంరక్షణ బాధ్యత ఎమ్మెస్సార్ ఫౌండేషన్ తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ యువత పాల్గొన్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో ఆదివారం శ్రీ సరస్వతి శిశుమందిరంలో స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సువ్వాడ శశికళ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఆర్ఎస్ఎస్ విభాగ్ బౌద్ధిక్ ప్రముఖ్ కిలపర్తి తిరుపతి రావు మాట్లాడుతూ సమాజ సేవే ధ్యేయంగా సేవలందిస్తున్న శ్రీ సరస్వతి శిశుమందిరాలను ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సువ్వాడ గుణవతి, విభాగ్ కార్యదర్శి బాలి విశ్వేశ్వరరావు, సమితి సభ్యులు సువ్వాడ రామకృష్ణ, భరత్ శ్రీనివాస్, పెద్దింటి మాధవరావు, డొంక ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేటలో వివేకానందుని జయంతి


బలిజిపేటలో వివేకానందునికి పూలమాలలు వేసిన యువకులు, పెద్దలు

బలిజిపేట: స్వామి వివేకానంద జయంతి వేడుకల సందర్భంగా బలిజిపేటలో యువకులు, పెద్దలు ఆదివారం వివేకానందుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ వివేకానందుని ఆశయసాధనకు అందరం పాటుపడాలని పిలుపునిచ్చారు. యువకులు, పెద్దలు వివేకానందుని సూక్తులను గ్రహించి వాటిని ఆచరించాలని సూచించారు. యువకులలో నూతనోత్తేజాన్ని నింపిన మహనీయుడు స్వామి వివేకానందుడని తెలిపారు. యువకులు ఎంత శ్రమిస్తే వారి భవిష్యత్తుతో పాటు దేశ భవిష్యత్ కూడా తిరుగులేని విధంగా ఉంటుందని చెప్పింది వివేకానందుడేనన్నారు. కార్యక్రమంలో వి.సుబ్బారావు, నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్ల సంజీవనాయుడు, యువకులు పాల్గొన్నారు.


పార్వతీపురంటౌన్: దుప్పట్లు పంపిణీ చేస్తున్న హెడ్ కానిస్టేబుల్ కె.కృష్ణమూర్తి


మక్కువ: మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు


సాలూరు రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎస్ఎస్ విభాగ్ బౌద్ధిక్ ప్రముఖ్ తిరుపతిరావు